క్లుప్తంగా

3న ఇంటర్వ్యూలు

నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3న ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంపీఈడీలో 55శాతం మార్కులు సాధించి, పీహెచ్‌డీ, యూజీసీ, నెట్, సెట్ అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏప్రిల్ 3 ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

శ్రీవారిసేవలో జేసీ



జేసీకి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని గురువారం రాత్రి నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానంద్ దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈయనకు దేవస్థాన అధికారులు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

రాపూరు: రాపూరు మండలానికి సంబంధించిన ఆసరా చెక్కులను శుక్రవారం మద్దెలమడుగు వద్ద ఉన్న మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పంపిణీ చేయనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పొదుపు సంఘ సభ్యులు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

కలువాయిలో నగర సంకీర్తన



నగర సంకీర్తనలో భక్తులు

కలువాయి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కలువాయి హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలువాయిలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి సభ్యులు మాట్లాడుతూ సర్వభయ నివారిణి ఒక్క రామనామమే అని, ధర్మోత్తముడైన రామచంద్ర ప్రభువు ప్రపంచానికే ఆదర్శప్రాయుడని తెలిపారు. బజారు వీధిలో రామాలయం నుంచి ప్రారంభమైన సంకీర్తన కార్యక్రమం రామనామ సంకీర్తనలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా హనుమాన్, వాల్మీకి రామాలయం, అంకమ్మ, పోలేరమ్మ, చెన్నకేశవస్వామి, కలువాయమ్మ దేవస్థానాలను దర్శించుకుంటూ సాగింది. సమితి సభ్యులు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు, అధిక సంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు.

పేదలకు ఫలసరుకుల పంపిణీ



ఫలసరుకులను అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

గూడూరు: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పాణకా మల్లికార్జునరెడ్డి గురువారం శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని పేదలకు నెలకు సరిపడా ఫలసరుకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కె.చంద్రశేఖర్, బి.ధనుంజయరెడ్డి, కె.శ్రీనివాసులు, జి.చంద్రశేఖర్, పీడీ కరీముల్లా, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం గ్రామంలో ఏటా నిర్వహించే జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ఎంపీపీ మునిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు నింద్ర, కళత్తూరు, శ్రీకాళహస్తి, వరదరయ్యపాళెం జట్లు తలపడ్డాయి. అందులో వరదయ్యపాళెం, కళత్తూరు జట్లు ప్రతిభ చాటి మొదటిరౌండ్‌లో విజేతలుగా నిలిచాయి. విజేతజట్లకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు చెంచుకృష్ణనాయుడు రూ.10వేల నగదు బహుమతి, మరో రూ.10 వేలు విలువ చేసే ఆరు వాలీబాల్స్, నాలుగు నెట్లను విరాళంగా అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నందకుమార్, హరిబాబు, గిరి, ఎంపీటీసీ అను, సర్పంచ్ బత్తెయ్య, సుబ్బరామనాయుడు, మాధవయ్య, నాగేష్, ఏలుమలై, వెంకటేష్, సంపత్, ఆర్గనైజర్ బత్తెయ్య, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

జైశ్రీరాం.. జైశ్రీరాం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కమనీయం ..సీతారాముల కల్యాణం
- భక్తులతో పోటెత్తిన రామాలయాలు

శ్రీరామనవమి వేడుకలను గురువారం వాడవాడలా వైభవంగా జరుపుకున్నారు. రామాలయాలు భక్తులతో పోటెత్తాయి. జైశ్రీరాం..జైశ్రీరాం భక్తుల నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఆలయ ఆవరణలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో గురువారం శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి బంగారు హనుమంత వాహనంపై భక్తులకు శ్రీరామ చంద్రునిగా దర్శనమిచ్చారు. అనంతరం మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అదేవిధంగా స్థానిక శ్రీరామ మందిరంలో సీతారామలక్ష్మణలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తగా దామిశెట్టి సురేష్ దంపతులు వ్యవహరించారు. షిర్డీ సాయిబాబా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సైదాపురం: మండలంలోని తురిమెర్ల, తలూపూరు, సైదాపురం,గిద్దలూరు,పెరుమాళ్లపాడు గ్రామాల్లో ఉన్న శ్రీరామమందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సైదాపురం తూర్పువీధి వీధిలో ఉన్న శ్రీరామమందిరం స్వామివారిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. సైదాపురంలో ఘనంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పెళ్లకూరు: పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు, టెంకాయతోపు, నెలబల్లి, తాళ్వాయిపాడు గ్రామాల్లోని రామమందిరాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఓజిలి: కురుగొండ, వజ్జవారిపాళెం, చిలమానుచేను గ్రామాల్లోని సీతారాముల ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.



సైదాపురం: పురవీధుల్లో విహరిస్తున్న విగ్రహాలు



తడకండ్రిగ రామాలయంలో..

కోటలో.. సీతారాముల కల్యాణం

కోట: స్థానిక తూర్పువీధిలోని శ్రీవైకుంఠరాజస్వామి దేవస్థానంలో గురువారం వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణ కనులపండువుగా నిర్వహించారు. అనంతరం సీతారాముల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. విద్యానగర్, కోటలోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. కల్యాణం

చిల్లకూరు: తమ్మినపట్నంలో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. క్రిష్ణ పట్నం ఆదానీ పోర్టుకు సంబంధించిన అధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గజవాహన సేవ, గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



నాయుడుపేట: అలంకరణలో సీతారాములు



వెంకటగిరిలో..

చిట్టమూరులో..

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని రామసాయి మందిరంతో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

తడ: శ్రీరామనవమి వేడుకలను తడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు కల్యాణం నిర్వహించారు. బీఎల్‌పాడులోని సాయిబాబామందిరంలోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



సూళ్లూరుపేటలో కల్యాణం



చిల్లకూరులో..



చిట్టమూరులో..

బాలాంజనేయస్వామి ఆలయంలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ బాలాంజనేయస్వామి ఆలయంలో సీతారాములు కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా స్థానిక బ్రాహ్మణవీధిలోని రామాలయం, కేఆర్‌పీ కాలనీ సమీపంలోని సాయిబాబా మందిరంలో, కచ్చేరివీధిలోని కూరగాయల మార్కెట్ వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

వాకాడులో వేడుకలు..

వాకాడు: మండలంలో వేడుకలు అత్యంతవైభవంగా నిర్వహించారు. వాకాడు కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు..

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రామమందిరం, రాజగోపాలపురంలోని ఆలయంలో, వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం, శివాలయం, పిచ్చిరెడ్డితోపు వీధిలోని విజయ గణపతి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో నవమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో రాత్రి సాయిబాబా గంధోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కనులపండువగా కల్యాణోత్సవం

వెంకటగిరి: పట్టణంలోని రామమందిరాల్లో నవమి ఉత్సవాలు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.



జీలపాటూరులో..



కోటలో సీతారాముల కల్యాణం..



స్వామివారి సేవలో రాంకుమార్‌రెడ్డి.





పెంచలకోన: హనుమంత వాహనంపై స్వామివారు

పేదరిక నిర్మూలనే జగనన్న లక్ష్యం



వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: మహిళా సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడవ విడత నగదును అందించేందుకు గురువారం పట్టణంలోని 4,768 మంది అక్క చెల్లెమ్మలకు రూ.4,11,72,524 కోట్ల నగదు చెక్కును ఎమ్మెల్యే కిలివేటి చేతులమీదుగా అందజేశారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికపరమైన ఇబ్బందులున్నప్పటికీ అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా నగదును అందజేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. దివంగతనేత వైఎస్సార్ పావలా వడ్డీతో రుణాలిస్తే ఆయన తనయుడిగా మరో మెట్టుపైకి ఎక్కి వడ్డీ లేకుండానే సున్నావడ్డీతో రుణాలిచ్చిన చరిత్ర జగనన్నకే దక్కుతుందని చెప్పారు. అయితే విశ్వంలో ఉన్న గ్రహాలను తానే కనిపెట్టానని, అసలు నేనులేకపోతే భూమే లేదని తరచూ గాలి మాటలు చెప్పుకునే చంద్రబాబు అబద్ధాలు మాట్లాడడం అలవాటై పోయిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్ చంద్రముని, కమిషనర్ ఎస్ నరేంద్ర కుమార్, వైస్ చైర్మన్ పోలూరు పద్మమిల్టన్, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, పి విజయలక్ష్మి, ఎస్ సౌజన్య, జి.మునస్వామి, బి మహేశ్వర్, పి.మునిప్రసాద్, ఎస్‌కే జబీనా, పి.జనార్దన్, కార్పొరేషన్ డైరెక్టర్లు తుపాకులు ప్రసాద్, మల్లి సుమతి, నేతలు వేణుయాదవ్, తిరుపాల్ యాదవ్, సురేష్, ఫయాజ్, ఎస్ గోపీరెడ్డి, టీఎల్ఎఫ్ అధ్యక్షులు స్వప్న, సీఓలు నారాయణమ్మ, అనుమాయమ్మ పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



నక్కా భానుప్రియ

వెంకటగిరి: వెంకటగిరి పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం, 2023–24 బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపల చెరువులు, కూరగాయలు, మాంసం మార్కెట్ వేలంపాటలు ఆమోదం వంటి 60 అంశాలతో కూడిన తీర్మానాలను కౌన్సిల్ ఆమోదం కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023–24 ఆర్థికసంవత్సరం సంబంధించి మున్సిపల్ బడ్జెట్ అంచనాలు, మూలధన జమలు, ఖర్చులు, ముగింపు నిల్వ వంటి అంశాలతో మిగులుబడ్జెట్‌గా తయారు చేసిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ ఆమోదం, పరిపాలనా మంజూరు కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తామని తెలిపారు.

బీడు భూములను సారవంతం చేయాలి

చిల్లకూరు: పంట దిగుబడి అనంతరం పంట పొలాలు బీడుగా మారి నిస్సారంగా ఉంటాయని అధిక దిగుబడి సాధించేలా బీడు భూములను సారవంతం చేయాలని ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఎల్ సుహర్లత పిలుపునిచ్చారు. కమ్మవారిపాళెం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా బీడు భూములను ఎలా సారవంతం చేయొచ్చు అనే విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాధారణంగా పంట సాగు చేసే ముందు పచ్చరొట్ట విత్తనాలు సాగుచేస్తారని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పాటించే పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో భూమిలో సారం పెంచవచ్చని తెలిపారు. అనంతరం విత్తనాలను ఎలా శుద్ధి చేసి వాటిని బాల్స్‌గా తయారు చేస్తారో అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీలు అశోక్, నాగూర్, యమున, పెంచలయ్య, లక్ష్మీ, శీనయ్య, స్వర్ణలత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నేడు తిరునాళ్లపై సమీక్ష

డక్కిలి: మండలంలోని దేవుని వెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో ఏప్రిల్ 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరగనున్న స్వామివారి తిరునాళ్లకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరామర్శ



పద్మనాభరెడ్డిని పరామర్శిస్తున్న రాంకుమార్‌రెడ్డి

వాకాడు: వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యుడు డాక్టర్ నేదురుమల్లి పద్మనాభరెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వాకాడులో ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. వాకాడుకు చెందిన తన పెదనాన్న పద్మనాభరెడ్డిని రాంకుమార్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలోని భగవతే మల్లికాంభ ఆలయం నిర్వాహకుల సారథ్యంలో గురువారం రెండు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతకు ప్రజల దాహార్తి తీర్చేందుకు పట్టణంలోని పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద, జాతీయ రహదారిపై ఆలయం సమీపంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని ఆశ్రమానికి చెందిన గూడూరు సుధీర్ రెడ్డి, వటుకనాథుల స్వామి, అవధానం సుధీర్ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. నిర్వాహకులు అమాస శివనారాయణ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో చైర్ ఓరియేషన్ విజయవంతం

తిరుపతి తుడా : స్విమ్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 8వ చైర్ ఓరియేషన్ కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో కేరళ రాష్ట్రం తిరువనంతపురం శ్రీచిత్రతిరునార్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సంజయ్‌బిహారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన బయో ఎథిక్స్ ఇన్ మెడిసిన్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చరణ్‌బిసింగ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ రమేష్ చంద్ర పాల్గొన్నారు.

రైతుబాంధవుడు మన ముఖ్యమంత్రి



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు వినతి అందజేస్తున్న రైతులు

- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: రైతులు బాగుంటే రాజ్యం బాగుంటుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారని, రైతు బాంధవుడు అని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో గూడూరు రూరల్ మండలానికి చెందిన రైతులు సమస్యలపై ఎమ్మెల్యేని గురువారం కలిశారు. పారిచర్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు పొలాల్లో ప్రభుత్వం ద్వారా బోర్లు వేసుకునేందుకు సహకరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఆర్‌డీఏ అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన బోర్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సమస్యలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సన్నిబోయిన మహేంద్రయాదవ్, శ్రీనివాసులరెడ్డి, మధు పాల్గొన్నారు.

మా సొంత నిధులతో నిర్మాణాలు

గూడూరు: పట్టణంలో ల్యాండ్ మార్క్ అయిన టవర్ క్లాక్‌ను అధునాతనంగా సొంత నిధులతో పూర్తిచేస్తున్నామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద నిర్మాణ దశలో ఉన్న టవర్ క్లాక్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తనను ఒక సారి ఎంపీగా, మరో సారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. టవర్ క్లాక్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దాన్ని తొలగించి, తన కుమారుడు నవీన్‌గుప్తా సొంత నిధులతో నిర్మాణ పనులు చేపట్టారన్నారు. అలాగే పూలే దంపతుల విగ్రహాలు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు తమ వంతుగా కృషిచేస్తున్నామని తెలిపారు. అలాగే రైతు బజారు, రూ.26 కోట్లతో ఏరియా ఆస్పత్రికి అవసరమైన అదనపు గదుల నిర్మాణ పనులు, కూరగాయల మార్కెట్ పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీ అమలు చేయాలి

వెంకటగిరి: బీజేపీ ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేసే దిశంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ నేత పల్లిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో చేపట్టిన నియోజకవర్గంలోని మాదిగపల్లెలను కలుపుతూ 367 కిలోమీటర్లు పాదయాత్ర గురువారం వెంకటగిరి చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక క్రాస్‌రోడ్డు నుంచి పోలేరమ్మ ఆలయం వరకూ మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించి అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని, ఇప్పటికైనా హామీ అమలు చేయకుంటే మాదిగలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నేతలు పి.రవిమాదిగ, ఎం.సురేష్‌మాదిగ, కె.మణి, ఎల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.



మోటారు సైకిళ్ల ర్యాలీతో స్వాగతం

ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించండి



ధర్మచాట్లవారి కండ్రిగ గిరిజన కాలనీలో శంకర్‌నాయక్

వెంకటగిరి: వెంకటగిరి రూరల్ మండలం ధర్మచాట్లవారి కండ్రిగ, గుండ్ల సముద్ర గిరిజన కాలనీల్లో ఫ్లోరైడ్ సమస్యను మూడు నెలల్లోగా పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వి. శంకర్‌నాయక్ తెలిపారు. ఆ గ్రామాల్లో ఆయన గురువారం తహసీల్దార్ పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లోరైడ్ సమస్య కారణంగా గిరిజన కాలనీల్లో పలువురు మృత్యువాత పడుతున్నారని, సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అంకయ్య, ప్రభుత్వ వైద్యాధికారి పల్లవి, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు తలపల చెంచు మల్లిఖార్జున్‌రావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, మహిళా అధ్యక్షురాలు సి.ఉష, పి. శ్రీనివాసరావు, విజయభాస్కర్‌రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.